క్లుప్తంగా

సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు మేలు



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్: సీఎం రిలీఫ్ ఫండ్ పథకంతో పేదలకు మేలు జరుగుతుందని స్థానిక ఎమ్మెల్యే సునీతారెడ్డి చెప్పారు. ఆమె సోమవారం స్థానిక తన క్యాంపు కార్యాలయంలో పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేశారు. పథకం కింద పేదలకు ఆర్థిక సహాయం అందించేందుకు తన వంతు కృషి చేస్తున్నట్లు ఆమె తెలిపారు. ఆమె వెంట బీఆర్‌ఎస్ నాయకులు శేఖర్, సత్యంగౌడ్, భిక్షపతి, ప్రసాద్ తదితరులు ఉన్నారు.

బోరుబావి తవ్వకం



పనులు ప్రారంభిస్తున్న దాత

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని పెద్దగొట్టిముక్ల గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న పెద్దమ్మ ఆలయం వద్ద దాత సహకారంతో సోమవారం బోరుబావి తవ్వకం చేపట్టారు. నిర్మిస్తున్న ఆలయం వద్ద నీటి అవసరాల గురించి నిర్వాహకులు చెన్నాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ రవిందర్‌యాదవ్ దృష్టికి తీసుకెళ్లారు. సోమవారం బోరుబావి తవ్వకం పనులను దాత రవిందర్ యాదవ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకుడు ధర్మారెడ్డి, ఆలయ నిర్వాహకులు ఉన్నారు.

బోనాల ఊరేగింపు



సూరంపల్లిలో బోనాల ఊరేగింపు

టేక్మాల్(మెదక్): మండలంలోని సూరమ్మ ఆలయ ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం బోనాలను ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు అందించిన తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి రథోత్సవం



స్వామివారి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని దేవుని వెంకటాపూర్ గ్రామంలోని వేంకటేశ్వర స్వామి రథోత్సవం సోమవారం భక్తులు ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవ విగ్రహాలను రథంలో ఉంచి, పూజలు నిర్వహించి భక్తులు రథాన్ని పురవీధుల గుండా ఊరేగించారు. మహిళలు మంగళహారతులతో స్వామి వారి రథానికి పూజలు నిర్వహించి, కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. స్వామివారు గ్రామాన్ని పాడి పంటలతో సుఖ శాంతులతో ఉంచాలని కోరుకున్నట్లు భక్తులు తెలిపారు. రథాన్ని లాగేందుకు చిన్న పెద్ద అనే తేడా లేకుండా పోటీపడ్డారు. ఈ కార్యక్రమం ఆద్యంతం ఉత్సాహంగా జరిగింది.

వైభవంగా కల్యాణోత్సవం



బుజ్రాన్‌పల్లిలో లక్ష్మీవేంకటేశ్వర కల్యాణం

పెద్దశంకరంపేట(మెదక్): మండల పరిధిలోని బుజ్రాన్‌పల్లి లక్ష్మీవేంకటేశ్వరాలయ వార్షికోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. సోమవారం ఆలయ ఆవరణలో లక్ష్మీ వేంకటేశ్వర కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య నిర్వహించారు. అనంతరం గ్రామ పురవీధుల గుండా ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఊరేగించారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు.

భక్తిశ్రద్ధలతో రంజాన్ వేడుకలు

జిల్లా వ్యాప్తంగా రంజాన్ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఆయా గ్రామాల్లోని ఈద్గాల వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వివిధ పార్టీలకు చెందిన నాయకులు ఈద్గాల వద్దకు చేరుకుని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ప్రవక్త మహమ్మద్ చూపిన మార్గంలో నడవడంతో పాటు ముస్లింలు శాంతియుతంగా ఉండాలని సూచించారు.



వెల్దుర్తిలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



టేక్మాల్‌లో..



కాడిపల్లిలో ఈద్గా వద్ద ముస్లింల ప్రార్థనలు



కొల్చారం ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



శివ్వంపేట(నర్సాపూర్): గోమారంలో..



పెద్దశంకరంపేట(మెదక్): జూకల్‌లో..



చిలపచెడ్‌లో..



31ఎన్‌ఆర్‌ఎస్02ఎ: నర్సాపూర్ ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



చేగుంటలో ఈద్గా వద్ద ప్రార్థనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

మల్లన్న ఆలయ వార్షికోత్సవాలు

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని కాళ్లకల్ మల్లన్న ఆలయంలో వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించారు. సోమవారం యాదవసంఘం ఆధ్వర్యంలో మల్లన్న దేవాలయం వద్ద పెద్దపటం వేసి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మల్లన్న కల్యాణం నిర్వహించారు. గ్రామ మహిళలు పెద్ద ఎత్తున బోనాలతో ఊరేగించి మల్లన్నకు తమ మొక్కులను చెల్లించుకున్నారు. కార్యక్రమంలో పలు గ్రామాల నంచి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని దర్శించుకున్నారు.

ఎర్రపోచమ్మ బోనాలు

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని అజ్జమర్రి గ్రామంలోని ఎర్రపోచమ్మ తల్లికి గ్రామస్తులు సోమవారం బోనాలను ఊరేగించారు. ఇందులో భాగంగా గ్రామ మహిళల బోనాల ఊరేగింపును డప్పుచప్పుళ్లతో, పోతురాజుల విన్యాసాలతో ఊరేగించి, అమ్మవారికి సమర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మల్లయ్య, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.



మనోహరాబాద్(తూప్రాన్): కాళ్లకల్‌లో మల్లన్న ఆలయం వద్ద వేడుకలు తిలకిస్తున్న భక్తులు

నాగ్సాన్‌పల్లిలో ఉమా కేదారీశ్వరస్వామి..

పాపన్నపేట(మెదక్): మండల పరిధిలోని నాగ్సాన్‌పల్లిలో ఉమా కేదారీశ్వర ఆలయ 42 వార్షికోత్సవం సోమవారం జరిగింది.ఈ సందర్భంగా రంగంపేట పీఠాధిపతి మాధవనంద సరస్వతి ప్రత్యేక పూజలు చేశారు. 58 జంటలు సత్యనారాయణ స్వామి వ్రతాలను ఆచరించారు. అనంతరం కుంకుమ అర్చనలు. అన్నదానం ఏర్పాటు చేశారు.

సంప్రదాయ నిలయాలు.. శిశు మందిరాలు

- మాధవానంద సరస్వతీ స్వామి
- రంగంపేట సరస్వతీ శిశు మందిరం వార్షికోత్సవాలు

కొల్చారం(నర్సాపూర్): భారతదేశ సంస్కృతి, సంప్రదాయ విద్యానిలయాలుగా శిశుమందిరాలు కొనసాగుతున్నాయని రంగంపేట ఆశ్రమ పీఠాధిపతి మాధవానంద సరస్వతీ స్వామి అన్నారు. మండలంలోని రంగంపేటలోని సరస్వతీ శిశు మందిరం వార్షికోత్సవాలు సోమవారం నిర్వహించారు. వేడుల్లో భాగంగా సరస్వతీ మాత చిత్రపటానికి జ్యోతి ప్రజ్వలన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శిశుమందిరాలు చదువుతో పాటు సదాచారం, నేర్పుతూ ఉన్నత విలువలను అందిస్తూ ఉన్నతమైన పౌరులను అందించడంలో శిశుమందిరాలు ముందున్నాయన్నారు. శిశు మందిరాల్లో విద్య పొందిన వారు ఉన్నత స్థాయిలో కొనసాగడం చూస్తున్నామన్నారు. నేటి పరిస్థితులకు అనుగుణంగా శిశుమందిరాల్లో తెలుగు మీడియంతో పాటు ఆంగ్ల మాధ్యమంలో విద్యా బోధన చేయడం మంచి విషయం అన్నారు. మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాలంటే పిల్లలను శిశు మందిరాల్లో చేర్పించడం తప్పనిసరి అన్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన సంగారెడ్డి జిల్లా విభాగ్ ప్రముఖు వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ.. శిశుమందిరాల అభివృద్ధికి విద్యా భారతి పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రధానాచార్యులు నవీన్, వక్తలు రంగంపేట పీఏసీఎస్ డైరెక్టర్ ప్రవీణ్‌రెడ్డి, తిరుపతి రెడ్డి, శిశు మందిరం బాధ్యులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మాధవానంద సరస్వతీ స్వామి

నెమలి మృత్యువాత

శివ్వంపేట(నర్సాపూర్): నెమలి మృత్యువాత పడిన ఘటన మండల పరిధి గంగాయిపల్లి గ్రామ శివారులో సోమవారం చోటు చేసుకుంది. అటవీ ప్రాంతం నుంచి వ్యవసాయ పొలాల్లోకి వచ్చిన నెమలి మృతి చెందిన విషయం రైతులు అటవీ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు వచ్చి పశు వైద్యాధికారితో పోస్టుమార్టం చేయించారు. రిపోర్టు ఆధారంగా విషయాలు తెలుస్తాయని అటవీ బీట్ అధికారి కుమార్ అన్నారు. ఎండ తీవ్రత తట్టుకోలేక నెమలి మృతి చెంది ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేశారు.



మృతి చెందిన నెమలి

మొబైల్ షాపులో చోరీ

కౌడిపల్లి(నర్సాపూర్): మొబైల్ షాపులో దొంగలు చోరీకి పాల్పడిన ఘటన కౌడిపల్లిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండల కేంద్రంలోని భవ్య మొబైల్ షాపు యజమాని భరత్ గౌడ్ ఆదివారం రాత్రి షాపునకు తాళం వేసి ఇంటికెళ్లాడు. సోమవారం వచ్చి చూడగా షాపుపై భాగం డబ్బా రేకులు తొలగించి దొంగలు రిపేర్‌కు వచ్చిన పాత ఫోన్లు, డబ్బులు ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి తెలిపారు.

చెక్కు అందజేత

చిలప్‌చెడ్(నర్సాపూర్): ఖరీదైన వైద్యం చేయించుకోలేని నిరు పేదలకు సీఎంఆర్‌ఎఫ్ వరంగా నిలుస్తుందని మండల పరిధిలోని ఫైజాబాద్ గ్రామ కాంగ్రెస్ నాయకులు అన్నారు. సోమవారం వారు గ్రామానికి చెందిన దాసరి శివరాజ్‌కు రూ.60 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేశారు.

మసీదులో అగ్నిప్రమాదం

పెద్దశంకరంపేట(మెదక్): మండల పరిధిలోని మల్కాపూర్‌లోని మసీదులో అదివారం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. దీంతో సుమారు రూ.50 వేల ఆస్తినష్టం సంభవించినట్లు నిర్వాహకులు తెలిపారు. రంజాన్ పండుగ సందర్భంగా అగ్నిప్రమాదం జరగడంపై ముస్లింలు, గ్రామస్తులు విచారం వ్యక్తం చేశారు.

విగ్రహానికి నిప్పుపెట్టినవారిని శిక్షించాలి

చిన్నశంకరంపేట(మెదక్): అంబేడ్కర్ నిప్పుపెట్టిన దుండగులను కఠినంగా శిక్షించాలని తెలంగాణ అంబేడ్కర్ సంఘం మెదక్ జిల్లా అధ్యక్షుడు రామచంద్రం డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. గద్వాల్ జిల్లా కేటిదొడ్డి మండలం ఇర్కిచెడు గ్రామంలో ఒక వర్గం వారు అంబేడ్కర్ విగ్రహానికి కక్షపూరితంగా నిప్పుపెట్టడం హేయమైన చర్య అన్నారు. గ్రామంలో అంబేడ్కర్ జయంతి రోజున విగ్రహం ఆవిష్కరించేందుకు దళితులు ప్రయత్నించగా, గ్రామంలోని మరో వర్గం వారు గ్రామంలో అంబేడ్కర్ విగ్రహం పెట్టొద్దని విగ్రహానికి నిప్పుపెట్టారన్నారు. ఈ ఘటన వెనక ఉన్న వారిని ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఎమ్మెల్యే పరామర్శ



త్యార్ల రమేశ్‌ను పరామర్శిస్తున్న మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు

పాపన్నపేట(మెదక్): మండలంలోని కొత్తపల్లి సొసైటీ చైర్మన్ త్యార్ల రమేశ్ కుటుంబాన్ని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు సోమవారం పరామర్శించారు. ఆదివారం రమేశ్ భార్య సుజాత బంగ్లపై నుంచి పడి మరణించింది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే ఆయనను పరామర్శించారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు ఉన్నారు. అంతకు ముందు బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి పరామర్శించారు.

కోటి తలంబ్రాల దీక్ష



తలంబ్రాలను అందజేస్తున్న లక్ష్మి దంపతులు

మర్కూక్(గజ్వేల్): భద్రాచలంలో నిర్వహించే సీతారాముల కల్యాణానికి తమ గోటితో వలిచిన వడ్లను తలంబ్రాలుగా పంపించడం తాము చేసుకున్న పుణ్య ఫలమని అంగడి కిష్టాపూర్ మాజీ సర్పంచ్ లక్ష్మి, రాములు గౌడ్ దంపతులు తెలిపారు. రామకోటి భక్త సమాజం వ్యవస్థాపకుడు రామకోటి రామరాజు నిర్వహించిన కోటి తలంబ్రాల దీక్షలో సోమవారం పాల్గొని గోటితో వడ్లను వలిచి వారు రామరాజుకు అందజేశారు.

జాతరలో ఆకట్టుకున్న భాగవతం

కౌడిపల్లి(నర్సాపూర్): నేటి ఆధునిక సినీప్రపంచంతో అంతరించిపోతున్న ఆనాటి నాటకాలు నేటి తరం కళాకారులు, ఆటలు వీధినాటక ప్రదర్శనలు ఇప్పటికీ ఆకట్టుకుంటున్నారు. కళాకారులు, ఉత్సాహవంతులు నాటి ఆటలకు ఇంక అక్కడక్కడ నేర్చుకుంటూ ప్రదర్శనలు చేస్తున్నారు. ఆదివారం రాత్రి నుంచి సోమవారం తెల్లవారే వరకు మండలంలోని వెల్మకన్న జాతరలో గ్రామస్తులు శివలీల భవగవతం, అయ్యోరివారు సత్యతులసి నాటకం ప్రదర్శించారు. కళాకారులు వేశాలు వేసి నటక ప్రదర్శణ చేయగా, చూపరులను అలరించారు. కాగా శ్రీరాయగిరి వేంకటేశ్వరాస్వామి ఆలయ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో చందాలతో సేకరించిన డబ్బులు నాటకం కోసం గ్రామస్తులకు రూ.25వేలు, ఆలయ నిధులనుంచి అయ్యోరివారికి రూ.10వేలు కళాకారులు ఖర్చులకోసం ఇచ్చారు. అంతరించిపోతున్న నటకాలను ప్రదర్శించేందుకు కళాకారుల ఖర్చుల కోసం డబ్బులు ఇచ్చినట్లు ఆలయ కమిటీ సభ్యులు, మాజీ సర్పంచ్ రాజేందర్, మాజీ ఎంపీపీ ఉపాధ్యక్షుడు నవీన్‌గుప్తా, మాజీ ఉపసర్పంచ్ లక్ష్మణ్, గ్రామస్తులు తెలిపారు.



వెల్మకన్న గ్రామస్తులు శివలీల భగవతం నాటకం

రుస్తుంపేటలో జాతర

నర్సాపూర్ రూరల్: మండల పరిధిలోని రుస్తుంపేటలో పోచమ్మ, ముత్యాలమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం బండ్లు, బోనాల ఊరేగింపు, శివసత్తులు విన్యాసాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఉత్సవాల్లో మాజీ ఎంపీటీసీ లక్ష్మీఅశోక్, నాయకులు మల్లేశ్, విజయ, భాస్కర్‌రాజు, శివకుమార్, సుదీప్, తదితరులు ఉన్నారు.

అసంపూర్తి పనులపై నిరసన



అసంపూర్తి రోడ్డు పనుల వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

శివ్వంపేట(నర్సాపూర్): రోడ్డు పనులు అసంపూర్తిగా వదిలేయడం వల్ల ఇబ్బందులు పడుతున్న రైతులు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. మండల కేంద్రం శివ్వంపేట నుంచి చెన్నాపూర్ వరకు బైలార్ రైస్‌మిల్ నుంచి తూప్రాన్ – నర్సాపూర్ హైవే వరకు బీటి రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. పనులు ప్రారంభించి అసంపూర్తిగా వదిలేయడంతో కంకర వల్ల రైతులు తీవ్ర అవస్థలు పడుతుండడంతో పాటు వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. పనులు ప్రారంభించి 8 నెలలు అవుతున్నా.. పూర్తికాకపోవడంపై ఇక్కట్లు పడుతున్నామని రైతులు రాంచెందర్‌గౌడ్, లక్ష్మణ్, దుర్గయ్య, నర్సింలు వాపోయారు. రోడ్డు పనులు చేస్తున్న సదరు గుత్తేదారుడికి సంబంధించి బిల్లులు సకాలంలో రాకపోవడంతో పనులు నిలిచిపోయాయి. దీంతో పొలాలకు వెళ్లే రైతులతో పాటు వాహనదారులు నిత్యం ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైన జిల్లా ఉన్నతాధికారులు స్పందించి చేసిన రోడ్డుకు సంబంధించి నిధులు మంజూరు చేసి, పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

రోడ్లపైనే మటన్ షాపులు

- పట్టించుకోని పంచాయతీ అధికారులు
- ఇబ్బందులకు గురవుతున్న ప్రజలు

అల్లాదుర్గం(మెదక్): పంచాయతీ అధికారుల నిర్లక్ష్యం ప్రజలకు శాపంగా మారుతోంది. మండల కేంద్రంలో ఎలాంటి అనుమతులు లేకుండా రోడ్లపై, కళాశాల ఆవరణలో మటన్ షాపులు వెలుస్తున్నాయి. విద్యార్థులు, ప్రజలు అవస్థలు పడుతుంటే పంచాయతీ అధికారులు తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. అల్లాదుర్గంలో ప్రతి సోమవారం వారంతపు సంత నిర్వహిస్తారు. పంచాయతీ అనుమతి లేకున్నా కళాశాల ఎదుట, ప్రభుత్వ స్థలంలోనే మటన్ షాపు పెట్టి విక్రయిస్తున్నారు. మరోకరు రోడ్డుపై కట్టెల షెడ్డు వేసుకొని మటన్ విక్రయాలు కొనసాగిస్తున్నారు. పంచాయతీ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా.. పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కళాశాల బోర్డు ఎదుటే మటన్ షాపు పెడితే పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోకపోవడం ఎమిటని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. అధికారులు చర్యలు తీసుకొని మటన్ షాపులను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.



అల్లాదుర్గం కళాశాల బోర్డు ఎదుట మటన్ షాపు

ప్రాణం పోయినా స్పందించరా?



ప్రమాదభరితంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

శివ్వంపేట(నర్సాపూర్): నివాసగృహాల వద్ద ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ వైర్లతో ప్రాణం పోయినా విద్యుత్ శాఖ సిబ్బంది స్పందించడం లేదు. మండల పరిధిలోని చెన్నాపూర్ గ్రామంలో ఆరు రోజుల క్రితం నివాసగృహాల వద్ద ఉన్న 11 కేవీ విద్యుత్ వైర్ల వల్ల షాక్ తగిలి సుధాకర్‌రెడ్డి మృతి చెందాడు. సిబ్బంది నిర్లక్ష్యంతో నిండు ప్రాణం పోయిందని గ్రామస్తులు మృతదేహంతో చిన్నగొట్టిముక్ల–గోమారం ప్రధాన రోడ్డుపై బైటాయించి రాస్తారోకో సైతం చేశారు. సమస్య పరిష్కరిస్తామని చెప్పిన విద్యుత్ సిబ్బంది నేటికి చర్యలు చేపట్టలేదని గ్రామస్తులు ఆరోపించారు. మరో ప్రమాదం జరగకముందే అధికారులు మేల్కొని ఇళ్ల మధ్య ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ తొలగించి మరోచోట ఏర్పాటు చేయాలన్నారు. ఈ విషయమై విద్యుత్ శాఖ ఇన్‌చార్జి ఏఈ సాయిరాం వివరణ కోరగా.. చెన్నాపూర్‌లో నివాసగృహాల వద్ద ప్రమాదభరితంగా ఉన్న వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్ గురించి ఉన్నతధికారుల దృష్టికి తీసుకెళ్లమని త్వరలోనే వాటిని తొలగిస్తామని చెప్పారు.

ఎండుతున్న వరి పంట

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికిలో పలువురు రైతుల వరి పంట ఎండుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో రైతుల సాగు చేసిన వరికి నీరందడం లేదు. చేసేదిలేక పశువులకు మేతగా పంటను వదిలేస్తున్నారు. ఎకరాకు రూ.20వేలకు పైగా ఖర్చుచేశామని నీరందక ఎండిపోవడంతో రైతులు నష్టపోతున్నామన్నారు.



తునికిలో నీరందక ఎండిన వరిపంట

ఆలయ అభివృద్ధికి సహకరించండి

మిరుదొడ్డి(దుబ్బాక): ఆలయ అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలని సీతారామాంజనేయ స్వామి ఆలయ కమిటీ అధ్యక్షుడు తోట కమలాకర్‌రెడ్డి కోరారు. మిరుదొడ్డిలో సోమవారం నూతన ఆలయ కమిటీ మొదటి సమావేశం నిర్వహించారు. శ్రీరామనవమి సందర్భంగా నిర్వహించాల్సిన ఏర్పాట్లపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీరామనవమి నాడు నిర్వహించే రాములోరి కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించడానికి గ్రామంలోని అన్ని వర్గాల వారిని భాగస్వామ్యం చేస్తామన్నారు. కార్యక్రమంలో రాజగోపాలాచారి, వరదాచారి, శ్రీనివాస్ రెడ్డి, రాజు, మల్లయ్య, రాజు, శ్రీనివాస్, తిరుపతి, మల్లేశం, యాదయ్య, అంజిరెడ్డి, దుర్గయ్య, టెలికాం బోర్డు సభ్యుడు మల్లేశం, ఐలయ్య, రమేశ్, కుమార్, తిరుపతి, నర్సింహారెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమలాకర్‌రెడ్డి